
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.26 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



అలరించిన కచేరీ

ప్రశాంతి నిలయంలో శుక్రవారం సత్యసాయి విద్యాసంస్థల నందగిరి క్యాంపస్ విద్యార్థులు నిర్వహించిన కృతజ్ఞతా పూర్వక సంగీత కచేరీ భక్తులను మైమరపింపజేసింది.

గరిష్టం/కనిష్టం 36.1°/19.8°

వాతావరణ మార్పులతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 10 నుంచి 15 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు



విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు అందజేసిన కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో తాము ఎంచుకున్న రంగంలో ముందుకు సాగాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు స్వయం ఉపాధి పథకం కింద 17 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.38.50 లక్షల విలువైన రుణాలు, డిగ్రీ, ఇతర వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న 15 మంది విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, మరో 13 మంది బధిరులకు టచ్‌ఫోన్లను కలెక్టర్ చేతన్ అందజేశారు. అలాగే విభిన్న ప్రతిభావంతులకు రూ.47 లక్షల రుణాలు, ఉపకరణాలు అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు చదువులు, క్రీడల్లో ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుకు కష్టం



కనగానపల్లి మండలం ముక్తాపురం వద్ద దెబ్బతిన్న దోస పంట

పుట్టపర్తి అర్బన్: అకాల వర్షంతో రైతులకు తీరని నష్టం కలిగింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో కాస్తోకూస్తో ఉన్న పంటలూ దెబ్బతిన్నగా రైతులకు రూ.లక్షల నష్టం వాటిల్లింది. ముఖ్యంగా ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అరటి నేలవాలగా, దోస, కళింగర, మామిడి తదితర పంటలకు నష్టం జరిగింది. 20 నుంచి 30 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

27 మండలాల పరిధిలో వర్షం..

వాతావరణంలో మార్పులతో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలోని 27 మండలాల పరిధిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కరోజే జిల్లాలో 614 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా నల్లమాడ మండలంలో 59.4 మి.మీ వర్షం కురిసినట్లు వెల్లడించారు. ఇక కనగానపల్లి మండలంలో 51.4 మి.మీ, పుట్టపర్తి మండలంలో 51.4 మి.మీ, చెన్నేకొత్తపల్లి 45.6, రామగిరి 41.4, కొత్తచెరువు 39.4, ఓడీచెరువు 35.4, పెనుకొండ 34.8, ధర్మవరం 34.6, బుక్కపట్నం 34, అమరాపురం 32.6, బత్తలపల్లి 23.6, రొద్దం 22.2, సోమందేపల్లి 19.6, తాడిమర్రి 18.2, ముదిగుబ్బ 15.2, గోరంట్ల 15.2, చిలమత్తూరు 9.8, తలుపుల 6.4, కదిరి 5.2, మడకశిర 4.6, నల్లచెరువు మండలంలో 3.4 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

కారుచౌక బేరం

హిందూపురానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల కుంభమేళాకు బెంగళూరు నుంచి విమానంలో వెళ్లారు. ముందుగానే వాట్సాప్ గ్రూపుల సమాచారం సేకరించి ఢిల్లీలో ఓ కారు కొనదలిచారు. కుంభమేళా నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లి అక్కడ తక్కువ ధరకే పెద్ద వాహనం కొనుగోలు చేశారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హిందూపురం చేరుకున్నారు. కొత్త వాహనం రూ.14 లక్షలు కాగా, నాలుగేళ్ల పాత కారు రూ.5 లక్షలకే దక్కిందని ఆనందపడుతున్నారు.

పుట్టపర్తికి చెందిన ఓ ఐటీ ఉద్యోగి వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం అందిస్తూ సెకండ్ హ్యాండ్ కార్ల క్రయవిక్రయాలు చేస్తుంటాడు. వాహనం విక్రయించిన వారి నుంచి ఒక శాతం, కొనుగోలు చేసిన వారి నుంచి ఒక శాతం చొప్పున కమీషన్ వసూలు చేస్తుంటాడు. ప్రతి నెలా సగటున రూ.50 వేల వరకు సంపాదిస్తున్నట్లు వెల్లడించాడు. ఖాళీ సమయాల్లో విక్రయించే వాహనాల వివరాలు తెలుసుకుని వాట్సాప్‌లో స్టేటస్ పెడితే.. కస్టమర్లే ఫోన్ చేసి వస్తున్నారని చెబుతున్నాడు.

అనంతపురానికి చెందిన మహబూబ్ బాషా సెకండ్‌హ్యాండ్ కార్ల కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. ప్రతి నెలా సగటున 50 వాహనాల వరకు విక్రయిస్తుంటాడు. వాహనం కొన్న, అమ్మిన వారి నుంచి 2 శాతం చొప్పున కమీషన్ తీసుకుంటాడు. పెద్ద వాహనాలు అమ్ముడుపోతే అధిక ఆదాయం వస్తుందని చెబుతున్నాడు. షాపు అద్దె, కూలీల ఖర్చు పోనూ నెలకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు మిగులుతుందని వెల్లడించాడు.

- పాత వాహనాలకు పెరిగిన డిమాండ్
- ఊపందుకున్న కొనుగోళ్లు, అమ్మకాలు
- జిల్లా వ్యాప్తంగా వెలసిన కన్సల్టెన్సీలు
- తక్కువ ధరకే ఢిల్లీ రిజిస్ట్రేషన్ కార్లు
- కర్ణాటక రిజిస్ట్రేషన్ వెహికల్స్ విక్రయాలే ఎక్కువ

3.5 లక్షలు — జిల్లాలో అన్ని రకాల వాహనాల సంఖ్య

2.3 లక్షలు — వివిధ రకాల ద్విచక్ర వాహనాలు

26 వేలు — వివిధ రకాల కార్లు



సాక్షి, పుట్టపర్తి

కరోనా దెబ్బకు చాలా మంది ప్రజా రవాణాను పూర్తిగా మానేశారు. ఎక్కడికి వెళ్లాలన్నా సొంత వాహనాల్లోనే ప్రయాణించేందుకే మొగ్గు చూపుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా వాహనాల రేట్లు కూడా భారీగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో చాలా మంది సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చాలా మంది సెకండ్ హ్యాండ్ వాహనాల కన్సల్టెన్సీలు ఏర్పాటు చేశారు. రూ.లక్షకు రెండు శాతం చొప్పున కమీషన్ తీసుకుని వాహనాల క్రయ, విక్రయాలు చేస్తున్నారు. దీంతో పట్టణాల నుంచి పల్లెల వరకు పాత వాహనాల క్రయవిక్రయాలు బాగా పెరిగాయి. కన్సల్టెన్సీల వల్ల వ్యయ ప్రయాసలు లేకుండా పలు వాహనాలను ఒకే వేదికపై చూసే అవకాశం లభిస్తోంది. దీనికి తోడు కర్ణాటక, ఢిల్లీ రిజిస్ట్రేషన్ కార్లు కన్సల్టెన్సీల ద్వారా తక్కువ ధరకే లభిస్తుండగా.. చాలా మంది సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోలుకే మొగ్గుచూపుతున్నారు.

సరసమైన ధరలకే..

దేశ రాజధాని ఢిల్లీలో పదేళ్ల పైబడిన వాహనాలను తిప్పేందుకు అనుమతుల్లేవ్. దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల్లో 15 ఏళ్ల వరకూ అనుమతులు ఉన్నాయి. ఫలితంగా అక్కడి నుంచి నేరుగా ఇక్కడకు వాహనాలను తరలిస్తున్నారు. ఆ తర్వాత వాహనాలకు పైపై మెరుగులు దిద్ది రిజిస్ట్రేషన్లు మార్చుకుని విక్రయాలు చేస్తున్నారు. మిగతా రాష్ట్రాల వాహనాలతో పోలిస్తే ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనాలు సరసమైన ధరలకే లభిస్తున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. ఇక కేంద్ర పాలిత రాష్ట్రాల్లో ట్యాక్స్ తక్కువగా ఉంటుంది కాబట్టి...అక్కడి వాహనాలు కూడా తక్కువ ధరకే అందుబాటులో ఉంటున్నాయి. ఈ క్రమంలో కేంద్ర పాలిత రాష్ట్రాల వాహనాలను సెకండ్‌హ్యాండ్‌లో బాగా విక్రయం అవుతున్నాయి. ఇక పొరుగు రాష్ట్రం కర్ణాటక రిజిస్ట్రేషన్ వాహనాలపై జిల్లా వాసులకు నమ్మకం ఎక్కువ. ఏదైనా ఇబ్బంది వచ్చినా సమీపంలోనే ఉంటుంది కాబట్టి ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. ఈక్రమంలో బెంగళూరుకు చెందిన వాహనాలను విపరీతంగా కొంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల వారు కార్ల కొనుగోలుకు ఎక్కువగా బెంగళూరు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోనూ కేఏ రిజిస్ట్రేషన్ వాహనాలు భారీగా కనిపిస్తున్నాయి.

ఐటీ ఉద్యోగులు సైతం..

పాత వాహనాల క్రయ విక్రయాల్లో పలు రంగాలకు చెందిన ఉద్యోగులు కూడా ఎంట్రీ ఇస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని వాహనాల వివరాలు పోస్టు చేస్తున్నారు. ఎవరైనా సంప్రదించి వాహనం గురించి వివరాలు అడిగితే కమీషన్ కింద కారు మొత్తంలో 1 శాతం తీసుకుని కారు ఉన్న లొకేషన్ షేర్ చేస్తున్నారు. లేదంటే వారే తీసుకెళ్లి కారు చూపిస్తున్నారు. ఆ తర్వాత బేరం కుదిరితే అమ్మిన వారు.. కొన్న వారితో రెండు శాతం చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నారు. ఇలా..ఇంట్లోనే ఉండి చాలా సులభంగా ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో నిత్యం కంప్యూటర్, ల్యాప్‌టాప్ ముందు ఉండే ఐటీ ఉద్యోగులు సైతం సమయం దొరికినప్పుడల్లా పాత వాహనాల క్రయవిక్రయాలపై దృష్టి సారిస్తున్నారు.

ఆస్పత్రి నిమిత్తమే ఎక్కువ..

మోడల్ (ఏ సంవత్సరంలో రిజిస్ట్రేషన్) ఆధారంగా రూ.లక్ష నుంచి సెకండ్ హ్యాండ్ కార్లు అందుబాటులో ఉంటున్నాయి. కొత్తగా టూవీలర్ కొనాలనుకునే వారు కూడా అదే డబ్బుతో పాత కారు కొనేందుకు ఇష్టపడుతున్నారు. అందువల్లే పట్టణాల నుంచి పల్లెల వరకు పాత వాహనాల సంస్కృతి వ్యాపించింది. ఏ గ్రామానికి వెళ్లినా.. కనీసం 20 కార్లు కనిపిస్తున్నాయి. చాలా మంది ఆస్పత్రులకు వెళ్లేందుకే సొంత వాహనాలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు ఉన్న ఇళ్లలో ఎక్కువగా కార్లు కనిపిస్తున్నాయి. ఉన్నఫలంగా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తే.. ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో వాహనాలు కొనుగోలు చేసినట్లు వివరిస్తున్నారు.

వివరాలు సరిచూసుకోవాలి



పాత వాహనాలు కొనే ముందు సంబంధిత షో రూంకు వెళ్లి రికార్డులు పరిశీలిస్తే మంచిది. వాహనం కండిషన్‌తో పాటు ఎలాంటి కేసులు ఉన్నాయనే వివరాలు సరి చూసుకుని కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాల వాహనాలు కొన్నా.. ఒకరి నుంచి మరొకరు చేతులు మారినా.. కొత్తగా కొన్న వారు వీలైనంత త్వరగా తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

– ఎస్ఎస్ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి, హిందూపురం

గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు!

- వినియోగదారుడి ఫిర్యాదుతో సిలిండర్ మార్చి ఇస్తామన్న ఏజెన్సీ



సిలిండర్ నుంచి నీరు వస్తున్న దృశ్యాన్ని చూపుతున్న వంట మనిషి

రొద్దం: వంట కోసం వాడే గ్యాస్ సిలిండర్‌లో మామూలుగా గ్యాస్ లిక్విడ్ రూపంలో ఉంటుంది. కానీ ఓ వినియోగదారుడికి ఇచ్చిన ఎల్పీజీ సిలిండర్‌లో మొత్తం నీళ్లు నిండిపోయి ఉన్నాయి. దీంతో వినియోగదారులు ఏజెన్సీకి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రొద్దంకు చెందిన గాజుల వన్నూరుస్వామి నూతన గృహ ప్రవేశం ఉండడంతో శుక్రవారం వంట చేయడానికి స్థానిక ఓ గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ తెచ్చుకున్నాడు. వంట మనిషి సిలిండర్‌ను గ్యాస్ పొయ్యికి అనుసంధానించినా స్టౌవ్‌కు గ్యాస్ సరఫరా కాలేదు. ఎంత ప్రయత్నించినా... పొయ్యి వెలగకపోవడంతో అసలు సిలిండర్‌లో గ్యాస్ ఉందా లేదా అనే అనుమానం వచ్చింది. దీంతో గ్యాస్ సిలిండర్‌ను తలకిందులు చేసి గ్యాస్ నాబ్‌ను నొక్కగా నీళ్లు వచ్చాయి. దీంతో వన్నూరు స్వామి విషయాన్ని గ్యాస్ ఏజెన్సీ వారికి తెలిపాడు. అయితే ఆయిల్ కంపెనీ నుంచి వచ్చిన సిలిండర్‌నే తాము డెలివరీ చేశామని, తమ తప్పులేదన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే సిలిండర్ తీసుకు వస్తే మార్చి మరో సిలిండర్ ఇస్తామన్నారు.

జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం: రానున్న మూడు రోజులు అనంతపురంతో పాటు శ్రీసత్యసాయి జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణ స్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల తోపాటు కర్నూలు, నంద్యాల, జిల్లాల్లో రానున్న 3 రోజులూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 37.5 నుంచి 38 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చన్నారు. అలాగే రాత్రి ఉష్ణోగ్రతలు 25.0 నుంచి 26.6 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

‘పుట్టపర్తి’ని కరువు జాబితాలో చేర్చాలి

- 6 మండలాలకు తగిన న్యాయం చేయాలి
- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వినతి



కలెక్టర చేతన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఏటా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటున్న పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాల్లో చేర్చి రైతులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి వినతి పత్రం సమర్పించారు. అలాగే పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు చేపల సంఘంలోని 16 మందిని నాలుగు రోజుల క్రితం బలవంతంగా చెరువులో చేపలు పట్టుకోకుండా గెంటేశారని వారికి న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం ఎలాంటి హక్కులేని వారు చేపలు పట్టి సొమ్ము చేసుకుంటున్నారని కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై విచారణ జరిపి సభ్యులందరికీ న్యాయం చేయాలని కోరారు. అనంతరం దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, అమడగూరు మండలాల్లో ఈసారి వర్షాభావం నెలకొందన్నారు. పంటలు పండక రైతులు నష్టాలు మూటగట్టుకున్నారన్నారు. చాలా ప్రాంతాల్లో భూగర్భజలమట్టం దారుణంగా పడిపోగా, బోరుబావుల కింద కూడా వ్యవసాయం సాగలేదన్నారు. పెట్టుబడుల రూపంలో పెట్టిన రూ. కోట్లు రైతుల చేతికి అందలేదన్నారు. అయినా ప్రభుత్వం నియోజకవర్గంలోని ఒక్క మండలాన్ని కూడా కరువు జాబితాలో చేర్చకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలను కరువు జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. వెంటనే ప్రభుత్వం పెట్టుబడి రాయితీ అందించాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమలు స్థాపించాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తవుతున్నా..జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఒక్క పరిశ్రమను కూడ నెలకొల్పలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం పరిశ్రమలు స్థాపించే విధంగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పీవీ రమణారెడ్డి, పార్టీ మాజీ మండల కన్వీనర్ నరసారెడ్డి, కన్వీనర్ గంగాద్రి, ఎంపీటీసీ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి



నియోజకవర్గాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ‘ప్రధాన మంత్రి సూర్యఘర్’ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వేల యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం కలెక్టర్ చేతన్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ‘సూర్యఘర్’ పథకానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేంద్రం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.55 వేలు సబ్సిడీ ఇచ్చి ఉచితంగా సోలార్ పరికరాలను బిగిస్తుందన్నారు. తమ అవసరాలకు వినియోగించుకొని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందిస్తే యూనిట్‌కు రూ.2.90 వంతున చెల్లిస్తారన్నారు. ఇక బీసీ వర్గాలకు 2 కిలో వాట్‌కు కేంద్రం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు సబ్సిడీ ఇస్తుందని, మిగతా రూ. 35 వేలను లబ్ధిదారుడు బ్యాంక్ ద్వారా రుణంగా పొందవచ్చన్నారు.

విజన్ ప్రణాళిక కమిటీని ఎంపిక చేయండి..

నియోజకవర్గాల విజన్ ప్రణాళికల్లో భూగర్భజలాలు, వ్యవసాయం, ఉద్యానవన శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలను పేర్కొనాలన్నారు. విజన్ ప్రణాళిక కమిటీ మెంటర్లుగా విషయ పరిజ్ఞానం ఉన్న వారిని నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున, జిల్లా స్థాయి కమిటీకి ఐదుగురిని ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో ప్రభుత్వ కార్యాలయాల్లో వాట్సాప్ పరిపాలను పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నీటి నాణ్యత తనిఖీని నిరంతరం పర్యవేక్షించాలని డీఎంహెచ్‌ఓ, ఆర్డీఓలను ఆదేశించారు. తాగునీటి పైపులైన్ లీకేజీ కాకుండా ముందస్తుగా మరమ్మతు పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాల్లో పారంపాండ్లు, పశువులకు నీటి తొట్టెల నిర్మించాలని, రోడ్డు కనెక్టివిటీ ఉండే ప్రాంతాలను గుర్తించి పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సీపీఓ విజయ్ కుమార్, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి ఆర్డీఓలు సువర్ణ, మహేష్, ఆనంద్, శర్మ, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, డీపీఓ సమత, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు అన్యాయం

- బిల్లుకు వ్యతిరేకంగా కదం తొక్కిన ముస్లింలు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో హిందూపురంలో నిరసన



హిందూపురంలో నిర్వహించిన ర్యాలీలో భారీగా పాల్గొన్న ముస్లింలు



వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ హిందూపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వేణురెడ్డి

చిలమత్తూరు: వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ బిల్లు వల్ల వక్ఫ్ ఆస్తులన్నీ పరాధీనం అవుతాయని పలువురు ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో హిందూపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీలో వైఎస్సార్ సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు చాంద్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ జబిఉల్లా, వైఎస్సార్ సీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసీఫుల్లా తదితరులతో కలిసి వందలాది మంది ముస్లింలు కదం తొక్కారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన కూటమి పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు మాట్లాడుతూ, వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీ, జనసేనలు ముస్లింలకు తీరని అన్యాయం చేశాయన్నారు. ఆ పార్టీలకు తప్పక బుద్ధిచెబుతామన్నారు.

ముస్లింలకు అన్యాయం జరిగితే సహించం..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి మాట్లాడుతూ, వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ముస్లింల హక్కులకు భంగం కలిగించేలా సవరణ చేశారని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు అవకాశం కల్పించడం ద్వారా వారి హక్కులకు భంగం కలుగుతుందన్నారు. అందువల్లే వైఎస్సార్ సీపీ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిందన్నారు. ముస్లింలకు బాసటగా వైఎస్సార్ సీపీ ఎప్పుడూ నిలబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లుపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డాక్టర్ బాషా, దాదాపీర్, రోషన్ అలీ, మల్లికార్జున, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మహేష్ గౌడ్, నాయకులు అమానుల్లా, ఆర్‌కే ఖలీల్, హుమయూన్, సీపీసీ సాధిఖ్, ఫరూక్, ఆసిఫ్, అయూబ్, నౌషద్, ఇమ్రాన్, బాబా, సీఎస్‌పీ నాగరాజు, హబీబ్, డిష్ చాంద్, ముస్తు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల అక్రమాలపై చర్యలు

- ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, మరికొందరికి నోటీసులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో కోట్లాది రూపాయల విలువ చేసే అసైన్డ్ భూములు ఆక్రమించిన వారిపై రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటుకలపల్లి రెవెన్యూ పొలంలో శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ అసైన్డ్ భూములను ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించిన అధికారులు.. ఆయనకు నోటీసులు జారీచేశారు. ఆయనతో పాటు శివశంకర్‌రెడ్డి, మరికొందరికి నోటీసులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చట్టం, 1977 ప్రకారం, అసైన్డ్ భూముల విక్రయం లేదా కొనుగోలు చట్టవిరుద్ధమని, అలా చేయడం అనుమతించబడదని నోటీసుల్లో స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేశారు. గడువు ముగిసిన తర్వాత, సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు, ఇతర కార్యకలాపాలను తొలగించి చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, భూకబ్జాలు చేసే వారిని, మధ్యవర్తులను, అసైన్డ్ భూములను అక్రమంగా విక్రయించే వారిని ఎవరినీ ఉపేక్షించబోమని జిల్లా రెవెన్యూ అధికారి మలోల స్పష్టం చేశారు.

క్లుప్తంగా

నిలకడగా ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌లో ఎండు మిర్చి విక్రయాలు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 90 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, ఈ–నామ్ ద్వారా వేలం పాటలు నిర్వహించారు. క్వింటా గరిష్ట ధర రూ.15వేలు, కనిష్ట ధర రూ.70వేలు చొప్పున సగటున రూ.13,500 ధరతో క్రయ విక్రయాలు సాగాయి. ఈ మేరకు మార్కెట్ యార్డ్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

అర్ధాకలితో అలమటించిన విద్యార్థులు



ఎంజీఎం పాఠశాలలో విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ప్రధానోపాధ్యాయురాలి నిర్లక్ష్యం కారణంగా హిందూపురంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 648 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రోజు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సి ఉంది. అయితే శుక్రవారం హెచ్‌ఎం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు ఆలస్యంగా అరకొర భోజనం అందడంతో ఆకలితో అలమటించారు. వండిన ఆహారా పదార్థాల్లో నాణ్యత లోపించడంతో విద్యార్థులు తినలేక ఇబ్బంది పడ్డారు. కాగా, వంట కార్మికులకు హెచ్‌ఎం తక్కువ బియ్యం అందిస్తుండడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు సమాచారం. దీనిపై హెచ్‌ఎం సామ్రాజ్యంను వివరణ కోరగా.. ' జిల్లా ఉప విద్యాధికారి ఆదేశాల మేరకు మధ్యాహ్నం 12 గంటలకు భోజనం అందిస్తున్నామని, అయితే నాసిరకంగా, అరకొరగా భోజనం అందిస్తుండడంపై విచారణ చేపడతాం' అని అన్నారు.


లోకం మెచ్చిన.. ప్రజాకవి వేమన

రేపటి నుంచి 4 రోజుల పాటు యోగి వేమన ఉత్సవాలు

సమాజంలోని అసమానతలను, బాల్య వివాహాలను రూపు మాపేందుకు స్త్రీ విద్యను ప్రోత్సహించిన సంఘ సంస్కర్తగా.. ప్రజల్లో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను తనదైన సాహిత్యంతో పారదోలిన అభ్యుదయ కవిగా ప్రజల హృదయాల్లో యోగి వేమన చిరస్థాయిగా నిలిచిపోయారు. పామరుల నోట సైతం అలవోకగా జాలువారేలా అర్థవంతమైన కవిత్వంతో ఆకట్టుకున్నారు. నాడు సమాజంలో నెలకొన్న సమస్యలను అనేక కోణాల్లో దర్శించి లోటుపాట్లపై, దోపిడీలపై వ్యంగ్యాస్త్రాలను సంధిస్తూ 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో వేమన రాసిన పద్యాలు తెలుగు వారికి సుపరిచితాలు. ఆడంబరంలేని అందమైన తెలుగు భాషకు చిరునామాగా మారి లోకం మెచ్చిన ప్రజాకవిగా ఖ్యాతిగాంచిన యోగి వేమన ఉత్సవాలు ఈ నెల 6 నుంచి నాలుగు రోజుల పాటు కటారుపల్లిలో నిర్వహించనున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.



వేమన ఆలయ ప్రవేశ ప్రధాన ద్వారం



వేమన సమాధి



గాండ్లపెంట: వేమన చరిత్ర కదిపితే ఎన్నో కథలు అలలు అలలుగా పలకరిస్తాయి. ఆయన కులంపై ఎన్నో వాదనలు ఉన్నా.. ఎన్నిసార్లు చరిత్రను తిరగేసినా వేమన 'రెడ్డి' కులస్తుడనే స్పష్టమైంది. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రిటిష్ అధికారి సీపీ బ్రౌన్ ద్వారా 1839లో వేమన పద్యాలు తొలిసారిగా పుస్తక రూపంలో వెలుగులోకి వచ్చాయి.

ప్రజాచైతన్య బావుటా

సామాజిక వైజ్ఞానిక నేత్రాలతో సమాజాన్ని దర్శించిన వేమన... కుట్రలను, కుతంత్రాలను రూపు మాపడానికి తనదైన సాహిత్యంతో ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన సంధించిన వ్యంగ్యాస్త్రాలు ఎప్పటికీ నిత్యనూతనంగానే నిలిచాయి. ఇందులో మచ్చుకు కొన్ని...

వేషభాష లెరిగి కాషయవస్త్రముల్
గట్టగానె ముక్తి గలుగబోదు
తలలు బోడులైన తలపులూ బోడులా
విశ్వదాభిరామ వినురవేమ!

అర్థం: 'వేషభాషలు నేర్చుకుని, కాషాయ వస్త్రములు ధరించినంత మాత్రాన మోక్షము రాదు, గుండు గీయించుకున్న మాత్రాన దురాలోచనలు దూరం కావు' అంటూ అలాంటి వ్యక్తుల వైఖరిపై వేమన వ్యంగ్యాస్త్రం సంధించారు.

- మరో పద్యంలో వ్యక్తుల ఎదుట ఒకరీతిన... మనసులో మరోరీతిన వ్యవహరించేవారి వైఖరిని ఎండగడుతూ..

మాటలాడు నొకటి మనసులోన నొకటి
ఒడలి గుణము వేరె యోచన వేరె
ఎట్లుగల్గు ముక్తి యీలగు తానుండ
విశ్వదాభిరామ వినురవేమ!

అర్థం: 'మనస్సులో ఒకటి ఉంచుకునే పైకి మరోలా మాట్లాడే వ్యక్తి గుణమొకటి... యోచన వేరొకటిగా ఉంటుంది. ఇట్టి వారికి మోక్షము ఎట్లా కలుగుతుంది' అని ప్రశ్నించారు.

ఉత్సవాలు ఇలా...

- ఆదివారం నుంచి 4 రోజుల పాటు గాండ్లపెంట మండలం కటారుపల్లిలో విశ్వకవి యోగివేమన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం మహాశక్తిపూజ (కుంభం పోయుట), మధ్యాహ్నం నుంచి రాత్రి 1 గంట వరకు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయి.
- సోమవారం రాత్రి బండ్లు తిరుగుట, పానక పన్నేరం, రాత్రి 9 గంటలకు పాటల కచేరీ (ఆర్కెస్ట్రా) ఉంటుంది.
- మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఉట్ల తిరునాల, రాత్రి 9 గంటలకు అగ్ని సేవ ఉంటాయి. అలాగే సాయంకాలం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఉంటాయి.
- బుధవారం రాత్రి 9 గంటలకు గొడుగుల మేరవణితో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక ఏర్పాట్లు..

ఉత్సవాలకు కదిరి పరిసర మండలాల నుంచే కాక ఉమ్మడి కర్నూలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే కదిరి నుంచి వచ్చే భక్తులు గాండ్లపెంట, రాయచోటికి వెళ్లే బస్సులు ఎక్కి కటారుపల్లి క్రాస్‌లో దిగి ఆటో లేదా నడక మార్గంలో కిలోమీటరు దూరం వెళ్లాల్సి ఉంటుంది. రాయచోటి నుంచి వచ్చే భక్తులు గాండ్లపెంట మీదుగా 4 కిలోమీటర్లు దూరంలో ఉన్న కటారుపల్లి క్రాస్‌కు చేరుకోవచ్చు.

కేఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా



చెరువు సమీపంలో బోల్తాపడిన బస్సు

అమరాపురం: మండలంలోని కె.శివరం గ్రామ చెరువు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున కేఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వివరాలు... కర్ణాటకలోని శిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పావగడ తాలూకా సాసలకుంట గ్రామం నుంచి శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు బెంగళూరుకు బయలు దేరింది. అమరాపురం మండలంలోని చిట్నడకు క్రాస్, అలదపల్లి, కె.గొల్లహట్టి మీదుగా 4.40 నిమిషాలకు కె.శివరం గ్రామానికి వెళుతుండగా.. చెరువు సమీపంలో రోడ్డుపై ఉన్న మట్టి రాత్రి కురిసిన వర్షానికి బురదగా మారడంతో బస్సు ఓ వైపుగా వాలడం మొదలైంది. ప్రయాణికులు ఒక్కసారిగా భయంతో కేకలు వేశారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు నెమ్మదిగా రోడ్డు పక్కన బోల్తాపడింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన లక్ష్మక్క, కెంచప్ప, శిల్ప, గాయత్రిను 108 వాహనం ద్వారా మడకశిరలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఇషాక్‌బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులు పావగడ తాలూకా ఎస్‌ఆర్‌పాళ్యం, కదిరేపల్లి గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పందుల అపహరణ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

బెళుగుప్ప: గ్రామాల్లో రెక్కీ నిర్వహించి పందులను అపహరించుకెళుతున్న దొంగల ముఠా సభ్యుల్లో ప్రధాన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఎస్‌ఐ శివ తెలిపిన మేరకు... ఈ ఏడాది జనవరి 5న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పందులను అపహరించుకుని వెళ్తున్నారంటూ బెళుగుప్పకు చెందిన రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో కొన్ని రోజుల క్రితం ఎరికల నాగరాజు, ఎరికల ముత్యాలప్పను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, అనంతపురానికి చెందిన సాకే ఆదినారాయణ అలియాస్ గుడ్డి ఆదినారాయణను శుక్రవారం కాలువపల్లి సమీపంలోని మానిరేవు క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.40 వేలు నగదు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఎక్సైజ్‌లో 44 మందికి ఎస్‌ఐలుగా అడ్‌హాక్ పదోన్నతి



ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారితో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఈఎస్ సుధీర్‌బాబు

కర్నూలు : ఎక్సైజ్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్‌ఐ పోస్టులను భర్తీ చేస్తూ ఆ శాఖ నోడల్ అధికారి (డిప్యూటీ కమిషనర్) శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 15 మంది క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతి కల్పించి బదిలీల్లో భాగంగా వారికి స్టేషన్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ మహిళా ఎస్‌ఐలకు సంబంధించి మరో నాలుగు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. వీరి సీనియారిటీ జాబితా త్వరలోనే రూపొందించి ఆయా పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. పదోన్నతి పొందిన వారందరికీ శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ప్రమోషన్‌తో పాటు పోస్టింగ్ కాపీలను డీసీ శ్రీదేవి అందజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పదోన్నతి దక్కిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని డీపీఈఓలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ రవితేజ ఉన్నారు. ఆయనకు కర్నూలు ఎసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు.

శ్రీరామనవమి ఏర్పాట్ల పరిశీలన



కరావుపల్లితండా వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ రత్న, తదితరులు

గోరంట్ల: మండలంలోని కరావులపల్లి తండా సమీపంలో నూతనంగా నిర్మించిన శివ అంజన్ దేవాలయ వార్షికోత్సవం ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఆలయ కమిటీ, ఆలయ నిర్మాణ కర్త సునీత శంకర్‌లాల్ నాయక్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరగనున్నాయి. అలాగే ఆలయ ప్రాంగణములో అదే రోజు మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నారు. వేడుకలకు మహారాష్ట్రకు చెందిన మంత్రి సంజయ్ దూల్చన్‌రాథోడ్‌తో పాటు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, గుజరాత్ ట్రిబినల్ వైస్ ప్రసిడెంట్ బి.ఆర్.ఆర్ కుమార్, తిరుపతి జిల్లా జడ్జి రామచంద్రుడు, తెలంగాణ జాయింట్ కమిషనర్ నారాయణనాయక్, జాయింట్ పోలీసు కమిషన్ ఆఫ్ పోలీసు బెంగళూరు రమేష్, కర్ణాటక మాజీ మంత్రి పరమేష్ నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద చేపట్టిన ఏర్పాట్లను, భద్రతా చర్యలను ఎస్పీ రత్న శుక్రవారం పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాట్లను పుట్టపర్తి ఆర్‌డీఓ సువర్ణ పరిశీలించారు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్, తహసీల్దార్ మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





పీడీ పోస్టుల రద్దు అమానుషం

బత్తలపల్లి: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులను రద్దు చేయడం అమానుషమని ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఏపీఎస్‌ఏపీఈఏ) నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లాస్కర్‌నాయక్, లక్ష్మీనారాయణ, ట్రెజరర్ బాబాఫక్రుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రభాకర్, రాజశేఖర్, గోపాల్‌రెడ్డి తదితరులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్కూళ్లతో పాటు జూనియర్ కళాశాలల్లో విద్య పరంగా పెనుమార్పులు తెస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం... నేడు నిర్వీర్యం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు రద్దు చేస్తూ వారిని ఇతర సబ్జెక్టులకు మార్పు చేస్తూ ఉత్తర్వులివ్వడం ద్వారా విద్యార్థులకు క్రీడావిద్యను దూరం చేసినట్లువుతుందన్నారు. కరోనా తర్వాత విద్యార్థులు సెల్‌ఫోన్లకు అలవాటుపడి ఇప్పుడిప్పుడే క్రీడల వైపు మొగ్గచూపుతున్నారని, ఇలాంటి తరుణంలో ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి గొడ్డలి పెట్టులా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో 199 పీడీ పోస్టులు రద్దు చేయడం అన్యాయం అన్నారు. ఇప్పటికే 19 ఏళ్లలోపు ఇంటర్ మీడియట్ క్రీడాకారులు పీడీలు లేక తీవ్ర ఒత్తిడికి లోనవుతూ స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌లో ఆడలేకపోతున్నారన్నారు. ఈ కన్వర్షన్‌ను ఆపకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటించి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడతామని హెచ్చరించారు.

ఘర్షణ కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష

పుట్టపర్తి టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి నమోదైన కేసుల్లో ఐదుగురు ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ సెషన్స్ కోర్టు జడ్జి వాసుదేవన్ శుక్రవారం తీర్పు వెలురించారు. వివరాలు.. కొత్తచెరువు మండలం నారేపల్లిలో నరేంద్ర, నరసింహులు వర్గాల మధ్య పాతకక్షలున్నాయి. ఈ క్రమంలో 2015, అక్టోబర్ 15న మధ్యాహ్నం 2 గంటలకు రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పరస్పర దాడులు చేసుకున్నారు. నరేంద్ర ఫిర్యాదు మేరకు చిన్నక్కగారి నరసింహులు, రవి, నారాయణప్ప, నాగభూషణపై, అలాగే నరసింహులు ఫిర్యాదు ఆధారంగా ఆదిఆంధ్ర నరేంద్ర, నాగేంద్ర, నాగులప్పపై అప్పటి ఏఎస్‌ఐ చలపతి కేసులు నమోదు చేయగా, ఎస్‌ఐ రాజశేఖర్ విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మొదటి కేసులో 17మంది సాక్షులను, రెండవ కేసులో 8 మంది సాక్షులను పెనుకొండ సెషన్ కోర్టు న్యాయమూర్తి వాసుదేవన్ విచారించారు. నేరం రుజువు కావడంతో మొదటి కేసులో ముద్దాయిలు చిన్నక్కగారి నరసింహులు, రవి, నారాయణప్ప, నాగభూషణకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా, రెండవ కేసులో ముద్దాయి నాగేంద్రకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున వాదలను పీపీ ఫక్రుద్దీన్ వాదించారు.

వివాహిత బలవన్మరణం



కదిరి టౌన్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కుటాగుళ్లకు చెందిన కొండప్ప కుమారుడు చిన్నా 50 రోజులు క్రితం బోయరామన్నగారిపల్లికి చెందిన చంద్రకళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆమెతో తల్లిదండ్రులు మాట్లాడడం మానేశారు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న చంద్రకళ శుక్రవారం ఉదయం తన భర్త ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్: వేసవి సెలవుల్లో ఇంటి పట్టున ఉండకుండా కళాశాలకు వెళ్లాల్సి రావడంతో మనస్తాపం చెంది ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... తాడిపత్రిలోని అంబాభవానీ కాలనీలో నివాసముంటున్న రంగయ్య, అమరావతి దంపతుల కుమారుడు హర్షిత్‌సాయి(17) విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మొదటి సంవత్సరం పరీక్షలు ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన విద్యార్థి.. ద్వితీయ సంవత్సం తరగతులు ప్రారంభం కావడంతో తల్లిదండ్రుల బలవంతంపై ఈ నెల 2న విజయవాడకు వెళ్లి, 3వ తేదీ తిరిగి వచ్చాడు. వెనక్కు ఎందుకు వచ్చావంటూ తల్లిదండ్రులు పరిపరి విధాలుగా అడిగినా మౌనంగానే ఉండిపోయాడు. ఈ క్రమంలో తనను కళాశాలకు పంపుతారనే మనోవేదనకు లోనైన హర్షిత్ సాయి శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సోమందేపల్లి: స్థానిక సాయినగర్‌కు చెందిన నారాయణప్పను హత్య చేసిన కేసులో నిందితుడు మారెప్పను అరెస్ట్ చేసినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. స్థానిక పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. హతుడు నారాయణప్ప బంధువు నరసింహులు గణేష్ అనే వ్యక్తికి కొంత డబ్బు అప్పుగా ఇచ్చాడు. ఈ క్రమంలో గత నెల 31న వారిద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. గణేష్‌కు మారెప్ప మద్దతు పలికాడు. దీంతో ఈ నెల 1న మారెప్పను నారాయణప్ప తల్లి గంగమ్మ మందలించింది. ఆ సమయంలో మారెప్ప ఆగ్రహం వ్యక్తం చేస్తూ గంగమ్మపై దాడికి ప్రయత్నిస్తుండగా నారాయణప్ప అడ్డుకున్నాడు. ఆయన ఛాతీపై మారెప్ప బలంగా కొట్టడంతో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం మారెప్పను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పీఏబీఆర్‌లో నీట మునిగి యువకుడి మృతి



మృతుడు కార్తీక్

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల గ్రామానికి చెందిన కత్రిమల కార్తీక్ (25) ప్రమాదవశాత్తు పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నీట మునిగి మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... కార్తీక్‌కు ఆరు నెలల క్రితం బళ్లారి జిల్లా కుడితిని గ్రామానికి చెందిన అఖిల అలియాస్ లక్ష్మి వివాహమైంది. ఈ క్రమంలో బళ్లారికి మకాం మార్చి కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉగాది పండుగ సందర్భంగా ఇటీవల స్వగ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. పీఏబీఆర్ సమీపంలో ఉన్న బంధువుల పంట పొలాలకు నీరు పెట్టేందుకు జలాశయంలో మోటారు దింపాల్సి ఉండడంతో వారితో కలసి గురువారం రాత్రి 9 గంటలకు జలాశయం వద్దకు వెళ్లాడు. మోటారును నీటిలో దించే క్రమంలో జలాశయం లోపలికి వెళ్లిన కార్తీక్.. కాలు చేపల వలకు చిక్కుకుంది. వల నుంచి కాలును విడిపించుకునే క్రమంలో ఊపిరి ఆడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకుని కార్తీక్ మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, పెళ్లైన ఆరు నెలలకే భర్తను కోల్పోయిన అఖిలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

ఇంటిపై నుంచి కిందపడి వైద్యుడి మృతి



అమిలినేని మధు (ఫైల్)

అనంతపురం: ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందపడి ఓ వైద్యుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న డాక్టర్ అమిలినేని మధు (49)కు భార్య డాక్టర్ సుష్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరూ దంత వైద్యులు కావడంతో నగరంలోని క్లాక్ టవర్ సమీపంలో ఓ ప్రైవేట్ క్లినిక్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంటిపైన నాలుగో అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించేందుకు డాక్టర్ అమిలినేని మధు వెళ్లాడు. గోడపైకి ఎక్కి వాటర్ ట్యాంక్ మూత తీసి పరిశీలిస్తుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి పై నుంచి కిందకు పడడంతో వెన్నెముక, కాళ్లు విరిగాయి. తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డాక్టర్ సుష్మ ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తిలో వెలసిన లక్ష్మీ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి జరగనున్నాయి. ఆలయంలో స్వామికి అభిషేక పూజలు, అనంతరం ఆదివారం లక్ష్మీ రంగనాథ స్వామి కల్యాణం , సోమవారం ఉదయం 11 గంటలకు మడుగుతేరు, అనంతరం సాయంత్రం రథోత్సవం, మంగళవారం పల్లకీ మహోత్సవం, బుధవారం ముత్యాల పల్లకీ ఉత్సవం, గురువారం సూర్యప్రభ వాహనం, శుక్రవారం పల్లకీ ఉత్సవం, శనివారం పూలతేరు కార్యక్రమాలు జరుగుతాయి. 13న వసంతోత్సవం కంకణ విసర్జన, 14న సప్త ప్రాకారోత్సవంలో భాగంగా ఉత్సవాలు ముగుస్తాయి.

నేటి అర్ధరాత్రి నుంచి కార్మికుల సమ్మె

అనంతపురం అర్బన్: వేతన బకాయిలు, పీఎఫ్ చెల్లించాలనే డిమాండ్‌తో శనివారం అర్ధరాత్రి నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారు. ఈ మేరకు శ్రీరామిరెడ్డి నీటి సరఫరా పథకం కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు జి.ఓబుళు, అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరు స్వామి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు.